తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్

ఆదివారం

11 అక్టోబర్ 2026


# బతుకునిచ్చే బతుకమ్మ.. గునుగు పూలతో ఉపాధి బాట!



### బతుకమ్మ పండుగతో పూలకు పెరిగిన డిమాండ్.. సేకరించి, రంగులద్ది హైదరాబాద్‌కు తరలింపు



కోహిర్, అక్టోబర్ 10, జనం సాక్షి:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ పూల సోయగాలతో పల్లెల్లో సందడి నెలకొంది. మహాలయ అమావాస్యతో ప్రారంభమయ్యే తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరాల నేపథ్యంలో గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర పూలకు డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా బతుకమ్మను పేర్చేందుకు ఎంతో ఉపయోగపడే గునుగు పూలు గ్రామీణ ప్రాంతాల్లో కొందరికి ఉపాధి మార్గంగా మారాయి. వ్యవసాయ పొలాల్లో సహజంగా పెరిగే ఈ పూలను సేకరించి, వాటికి వివిధ రంగులు అద్ది విక్రయిస్తూ కూలీలు ఆదాయం పొందుతున్నారు. దీంతో బతుకమ్మ పండుగ అటు మహిళలకు ఆనందాన్ని పంచుతుండగా, ఇటు పూల సేకరణపై ఆధారపడే వారికి ఉపాధిని కల్పిస్తోంది.

**పొలాల్లో విరివిగా గునుగు పూలు...**

వ్యవసాయ పొలాల గట్లపై, ఖాళీ ప్రదేశాల్లో గునుగు మొక్కలు సహజంగా పెరుగుతుంటాయి. పంటలకు పోషకాలు అందకుండా కలుపు మొక్కలు అడ్డుపడతాయని భావించే రైతులు పంట ఎదుగుదల దశలో వాటిని తొలగిస్తుంటారు. అయితే కొన్ని ప్రాంతాల్లో కలుపు మొక్కల మధ్య పెరిగే గునుగు మొక్కలు బతుకమ్మ సీజన్‌లో పూలను అందిస్తున్నాయి. పండుగ సమీపించడంతో ఈ పూలకు డిమాండ్ పెరగడంతో కూలీలు పొలాల వద్దకు వెళ్లి పూలను సేకరిస్తున్నారు. అనంతరం వాటిని కట్టలుగా కట్టి మార్కెట్లకు తరలిస్తూ ఉపాధి పొందుతున్నారు.

**ఎరుపు, తెలుపు రంగుల్లో పూల అందాలు...**

కోహిర్ మండలంలోని వివిధ గ్రామాల వ్యవసాయ పొలాల్లో ఎరుపు, తెలుపు రంగుల్లో గునుగు పూలు కనువిందు చేస్తున్నాయి. మండలంలోని సజ్జాపూర్ ప్రాంతంలో ఎర్రటి గునుగు పూలు ఎక్కువగా లభిస్తుండగా, ఖానాపూర్,



పైడిగుమ్మల్, బడంపేట తదితర ప్రాంతాల్లో తెల్లటి గునుగు పూలు కనిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో పూలు ఎక్కడ విరివిగా ఉన్నాయో తెలుసుకుంటున్న కూలీలు అక్కడికి వెళ్లి వాటిని సేకరిస్తున్నారు. సేకరించిన పూలను శుభ్రపరిచి, అవసరమైన విధంగా కత్తిరించి, వివిధ రంగులు అద్ది ఆరబెడుతున్నారు. అనంతరం వాటిని కట్టలుగా సిద్ధం చేసి హైదరాబాద్ మార్కెట్లకు తరలిస్తున్నారు.

**రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు ఆదాయం**

గునుగు పూల సేకరణ, రంగులు అద్దడం, విక్రయించడం ద్వారా కొందరు కూలీలు రోజువారీ ఆదాయాన్ని పొందుతున్నారు. బతుకమ్మ పండుగ సమయంలో హైదరాబాద్ నగరంలో ఈ పూలకు డిమాండ్ ఉండటంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వ్యాపారులు, కూలీలు పూలను తరలిస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న రోజుల్లో రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు ఆదాయం వస్తుందని పూల సేకరణదారులు చెబుతున్నారు. అయితే మార్కెట్‌కు పూలు అధికంగా చేరినప్పుడు ధరలు తగ్గిపోతాయని, దాంతో ఆదాయం కూడా తగ్గుతుందని పేర్కొంటున్నారు.

**పండుగతో పాటు ఉపాధి...**

బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తోంది. పూలను సేకరించడం నుంచి వాటిని విక్రయించే వరకు అనేకమందికి ఈ పండుగ ఉపాధి కల్పిస్తోంది. ముఖ్యంగా వ్యవసాయ పనులు తక్కువగా ఉన్న సమయంలో గునుగు పూల సేకరణ కొంతమంది కూలీలకు అదనపు ఆదాయాన్ని అందిస్తోంది. పల్లెల్లో సహజంగా లభించే పూలకు పండుగ వేళ డిమాండ్ పెరగడంతో వాటిని సద్వినియోగం చేసుకుంటూ కుటుంబ పోషణకు తోడ్పడుతున్నామని కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అందుకే బతుకమ్మ పండుగ తమకు ఆనందంతో పాటు బతుకుదెరువును కూడా అందిస్తోందని వారు చెబుతున్నారు.

## పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు

- **యువత, విద్యార్థులు పాల్గొనాలి**
- **సిద్దిపేట సీపీ రష్మి పెరుమాళ్**



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 10 (జనంసాక్షి):**
పోలీస్ ఫ్లాగ్ డే-2026 సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీల్లో విద్యార్థులు, యువత, పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. 21 అక్టోబర్ పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకుని అక్టోబర్ నెలలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది చేస్తున్న త్యాగాలు, ప్రజల రక్షణ కోసం అందిస్తున్న సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ పోషిస్తున్న పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు సిపి తెలిపారు. సైబర్ నేరాల నివారణలో పౌరులు, పోలీసుల పాత్ర, మాదకద్రవ్యాల వినియోగం నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు అనుసరించాల్సిన మార్గాలు వంటి అంశాలపై పోటీలు పోలీస్ స్టేషన్ వారిగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డిగ్రీ, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర, "తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర" అనే అంశాలపై వ్యాసరచన పోటీలు సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

**షార్ట్ ఫిల్మ్ పోటీలు...**

పోలీస్ శాఖకు సంబంధించిన అంశాలపై తెలుగు, ఉర్దూ లేదా ఆంగ్ల భాషల్లో గరిష్ఠంగా మూడు నిమిషాల నిడివి కలిగిన షార్ట్ ఫిల్మ్‌లను రూపొందించి పోటీల్లో పాల్గొనవచ్చని సిపి తెలిపారు. పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన వంటి అంశాలను ప్రతిబింబించేలా షార్ట్ ఫిల్మ్‌లను రూపొందించాలని సూచించారు.
యూనిట్ స్థాయిలో ఎంపికైన ఉత్తమ మూడు షార్ట్ ఫిల్మ్‌లను రాష్ట్రస్థాయి ఎంపికకు పంపించనున్నట్లు, ఎంపికైన వారికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

**ఫోటోగ్రఫీ పోటీలు...**

పోలీస్ శాఖ విధులు, సేవలు, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, పోలీస్-ప్రజల సంబంధాలు, విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వంటి అంశాలపై ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సిపి తెలిపారు. ఈ పోటీలకు సమర్పించే ఫోటోలు ఇటీవల తీసినవై ఉండాలని, పోలీస్ శాఖ విధులకు సంబంధించినవై ఉండాలని స్పష్టం చేయడమైనది. యూనిట్ స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఫోటోలను రాష్ట్రస్థాయి ఎంపికకు పంపించనున్నట్లు, ఎంపికైన ఫోటోగ్రాఫర్లకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన షార్ట్ ఫిల్మ్‌లు, ఫోటోలను రాష్ట్రస్థాయి పరిశీలనకు పంపించి, సంబంధిత పోలీస్ పోర్టళ్లలో 2026 అక్టోబర్ 30వ తేదీలోగా అప్‌లోడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. కావున, సిద్దిపేట జిల్లాలోని పోటీల్లో పాల్గొనే వారు తమ షార్ట్ ఫిల్మ్‌లు, ఫోటోలను ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ల (ఎస్ హెచ్ ఓ ఎస్) ద్వారా పోలీస్ కమిషనర్ కు ర్యాలయానికి పంపించాలని సిపి సూచించారు. విద్యార్థులు, యువత, ఫోటోగ్రఫీపై ఆసక్తి ఉన్నవారు, పోలీస్ సిబ్బంది ఈ పోటీలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను ప్రదర్శించాలని, సమాజంలో అవగాహన పెంపొందించే సందేశాలను సృజనాత్మకంగా ప్రజలకు చేరవేయాలని సిద్దిపేట సిపి రష్మి పెరుమాళ్ పిలుపునిచ్చారు.

## 24 గంటల విద్యుత్ అందించి రైతులను ఆదుకోండి

- **పొలంలో ఎడ్లను మేపుతూ రైతుల నిరసన**







**చేర్యాల, అక్టోబర్ 10(జనంసాక్షి):** రైతాంగానికి నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ అందించి ఆదుకోవాలని బాధిత రైతులు శనివారం మండలంలోని ఆకునూరు గ్రామంలో ఎండిపోయిన వరి చేనులో ఎడ్లను మేపుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు కంతుల నర్సయ్య మాట్లాడుతూ.. తాను పది ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని, లక్షల్లో పెట్టుబడులు పెట్టి పండిస్తున్న వరి పంట వేస్తే, చేతికందే దశలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక నీళ్లు అందక పంట చేను పూర్తిగా ఎండిపోయిందని, ఇలాంటి పరిస్థితిలో పంట పండిన పండకపోయిన కౌలు ఇవ్వక తప్పదు,లక్షల్లో పెట్టుబడి పెట్టి ఎండిన పొలంలో పోసినట్టు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కనీసం 15 గంటలు అయినా విద్యుత్ ను అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో రైతులు శెట్టె మల్లయ్య, సందబోయిన వెంకటేష్, పస్తం మల్లేష్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నేడే శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

- గోకుల్ షెడ్‌లో ఏర్పాట్లు పూర్తి
- 15న బోనాలు, 19న చండీ హోమం



**పాపన్నపేట, అక్టోబర్ 10 (జనంసాక్షి):** పుడమి సాక్షిగా ప్రకృతి ఒడిలో కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. ఈ నెల 11 న ఆదివారం అమ్మవారికీ పట్టు వస్త్రాల సమర్పణతో శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభ మవుతాయని ఆలయ ఈవో మఠం వీరేశం తెలిపారు. ఆలయ సమీపం లోని గోకుల్ షెడ్ లో ఉత్సవాలు నిర్వహించేందుకు షెడ్డులో మండపాన్ని విద్యుత్ దీపాలు,పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. మొదటి రోజైన 11 న ఆదివారం పాడ్యమిని పురస్కరించుకొని బాలా త్రిపుర సుందరి దేవి (ముదురు పసుపు) రూపంలో మాత భక్తులకు దర్శనమిస్తుందని,12 న గాయత్రి దేవిగా (గులాబీ),13 న అన్నపూర్ణ దేవిగా (నీలం), 14న కుష్మాండ దేవిగా (ఆకుపచ్చ),15 న మహాలక్ష్మీ దేవిగా (పెసర),16న సరస్వతి దేవిగా (తెలుపు),17న లలిత త్రిపుర సుందరి దేవిగా (నారింజ),18న దుర్గాదేవి గా (ఎరుపు),19న మహిషాసుర మర్దిని దేవిగా (మెరున్),20 న చివరి రోజు విజయ దశమిని పురస్కరించుకొని రాజరాజేశ్వరి సహిత వన దుర్గాదేవిగా (పసుపు) రంగు వస్త్రలంకరణ రూపంలో మాత భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజు అమ్మవారికీ విశేష పూజలు జరగనున్నాయి. 15 న గురువారం వనదుర్గా మాతకు బోనాలు,19 న సోమవారం సువాసిని పూజ,చండీ హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వనదుర్గా అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిరోజు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు ఈ అధ్యాత్మిక వేడుకకు అధిక సంఖ్యలో పాల్గొని మాత కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

# దేవి నవరాత్రులకు ముస్తాబైన దేవాలయం

- తూప్రాన్‌లో నేటి నుండి నవదుర్గ నవరాత్రి ఉత్సవములు ప్రారంభం
- మహంకాళి దేవాలయంలో 28వ వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబు





**తూప్రాన్, అక్టోబర్ 10(జనంసాక్షి):** నవదుర్గ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తూప్రాన్‌లోని మహంకాళి దేవాలయంలో, తూప్రాన్‌లోని దేవి గార్డెన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను వైభవపీతంగా నిర్వహిస్తున్న దుర్గాభవాని సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ ఆదివారం నుండి 21వ తేదీ బుధవారం వరకు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 11వ తేదీ ఆదివారం ఉదయం గోపూజ, అఖండ దీపారాధన గణపతి పూజ వేద స్వస్తి పుణ్యావాచనము మహా సంకల్పము పంచగవ్య ప్రాశ న దీక్షా స్వీకరణ ధ్వజారోహణము అమ్మవారికి చతుస్ షష్టి పూజ అంకురార్పణ మంటప దేవత ప్రధాన కలశ స్థాపన 12వ తేదీ సోమవారం ఉదయం చతుస్ షష్టి పూజ రాత్రి 7 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం మహా లింగార్చన బిల్వర్చన 13 వ తేదీ మంగళవారం రాత్రి శాకాంబరి అలంకరణ 14వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు సామాజిక సమరసితా కార్యక్రమం రాత్రి 7 గంటలకు గీతా స్కూల్ విద్యార్థులచే సాంస్కృతి కార్యక్రమాలు 15వ తేదీ గురువారం రాత్రి 6 గంటలకు 16వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు లక్ష కుంకుమార్చన కార్యక్రమం రాత్రి 8 గంటలకు మూలా నక్షత్రం పిల్లలచే సరస్వతి మాత పూజ 17వ తేదీ శనివారం రాత్రి 7 గంటలకు ఉమామహేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం 18వ తేదీ ఆదివారం రాత్రి 7 గంటలకు లక్షదీపార్చన కాలిక దుర్గాష్టమి సుహాసిని పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు మరియు 19వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు మహాబలిదానం మహా పూర్ణాహుతి కార్యక్రమం మహర్నవమి 20వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ మరియు రాత్రి 7 గంటలకు దుర్గాభవాని యూత్ వారిచే మహంకాళి దేవాలయంలో రావణాసుర దహన కాండ తుపాకులసే మల్లె చెట్టు కాల్చే కార్యక్రమం ప్రతిరోజు ఉదయం రుద్ర స్వాహాకార పూర్వక మహా చండీయాగం, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తూప్రాన్‌లోని దేవి గార్డెన్లో సలాక రాజేష్ శర్మ ఆధ్వర్యంలో దీన్ని నవ రాత్రులు కనుల పండుగగా నిర్వహించనున్నారు.

# గుమ్మడిదల ప్రగతికి నాంది కేసీఆర్

- నూతన మండల ఏర్పాటుతోనే అభివృద్ధికి పునాది
- కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుల పాలాభిషేకం



**గుమ్మడిదల, అక్టోబర్ 10 (జనంసాక్షి):** గుమ్మడిదలను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయడంతోనే ఈ ప్రాంత అభివృద్ధికి పునాది పడిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల నూతన మండలంగా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు.

మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, చిన్నపాపని కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2016లో కేసీఆర్ నేతృత్వంలోని అప్పటి ప్రభుత్వం గుమ్మడిదలను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయడంతో పరిపాలన ప్రజలకు మరింత చేరువైందని పేర్కొన్నారు. మండల ఏర్పాటు అనంతరం ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు మార్గం సుగమమైందని తెలిపారు. గుమ్మడిదల నేడు అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి మండల ఏర్పాటు కీలకంగా నిలిచిందని పేర్కొంటూ కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, వార్డు కౌన్సిలర్లు రాజశేఖర్, చక్రపాణి, విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, శేఖర్‌రెడ్డి, సదానందరెడ్డి, మొగులయ్య, అంజనేయులు యాదవ్, వినోద్ గౌడ్, రమేష్, సత్యనారాయణ, ప్రకాష్, రాజు, రాము పాల్గొన్నారు.

## పొదుపు భవిష్యత్తు అవసరాలను తీరుస్తుంది

- మృతుడి కుటుంబానికి రూ.1,13,654 ఆర్థిక సాయం



**నంగునూరు, అక్టోబర్ 10 (జనంసాక్షి):** పొదుపు భవిష్యత్తు అవసరాలకు ఆసరాగా నిలుస్తుందని మగ్దుంపూర్ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు కదారి తిరుపతిరెడ్డి అన్నారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామానికి చెందిన సంఘం సభ్యుడు బట్ట చంద్రయ్య ఇటీవల మృతి చెందడంతో, సంఘం నిబంధనల ప్రకారం ఆయన కుటుంబానికి రూ.1,13,654 ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. ఇందులో సామూహిక నిధి, అభయ నిధి, నియమిత పొదుపులు, బోనస్ ఉన్నాయి. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దుబారా తగ్గించి పొదుపు అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆపద సమయంలో పొదుపు సంఘాలు సభ్యుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రాజయ్య, పాలకవర్గ సభ్యులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు చిన్న ఘనపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ




**కొల్చారం, అక్టోబర్ 10(జనంసాక్షి):** కొల్చారం మండలంలోని చిన్న ఘనపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నేడు ఉదయం 11 గంటలకు సొసైటీ ఆవరణలో మహాజన సభ నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు మంద నాగయ్య తెలిపారు. సంఘం ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, సొసైటీ పరిధిలోని రైతులు, గ్రామ పెద్దలు, యువకులు, ఇతర గ్రామస్తులు సభకు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. అందరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ సహకార సంఘం కార్యకలాపాల్లో రైతుల భాగస్వామ్యం కీలకమని, సంఘానికి సంబంధించిన కార్యక్రమాల్లో సభ్యులు చురుకుగా పాల్గొనాలని తెలిపారు.

## శనేశ్వర ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- శనేశ్వరున్ని దర్శించుకున్న ఎంపీ సురేష్ షెట్కార్..



**ఝరాసంగం, అక్టోబర్ 10 (జనంసాక్షి):** శనివారం అమావాస్యను పురస్కరించుకొని మండల పరిధిలోని దత్తగిరి ఆశ్రమంలో వెలసిన శనీశ్వర ఆలయంతో పాటు ఏడాకుల పల్లి గ్రామ శివారులోని సప్తపురి శనిఘాట్‌లో కొలువదీరిన శనీశ్వర ఆలయాలకు వేకువజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ శనీశ్వర ఆలయాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దత్తగిరి ఆశ్రమంలో నిర్వహించిన శనీశ్వర యజ్ఞంలో పాల్గొన్నారు. శనీశ్వరునికి తిల తైలంతో అభిషేకించి మొక్కులు తీర్చుకున్నారు.సినియర్ నాయకులు హన్మంత్ రావు పాటిల్, అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికలకు సన్మానం



**కౌడిపల్లి, అక్టోబర్ 10 (జనంసాక్షి):** అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కౌడిపల్లిలో ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ సంతోష ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలు నిర్వహించారు. విద్య, క్రీడలు తదితర రంగాల్లో ప్రతిభ కనబరిచిన బాలికలను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ బాలికల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, బాలికలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సూపర్‌వైజర్ సంతోష మాట్లాడుతూ బాలికల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిఖిత, నందిని, రేణుక, దివ్య, సౌజన్య, లాస్యప్రియ, నుస్రత్, అరుంధతి తదితర బాలికలను సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్వేత, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాగపూరి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**చేర్యాల, అక్టోబర్ 10 (జనంసాక్షి):** నాగపూరి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గ్రామ సర్పంచ్ సంతోషి కరుణాకర్, చేర్యాల మండల తాజా మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్‌లు శనివారం అందజేశారు. గతంలో అనారోగ్యంతో ఆసుపత్రి ఖర్చులకు గురైన బాధితులకు జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి మంజూరు చేసిన చెక్కులను పంపిణీ చేశారు.

పుల్లూరు మహేందర్‌కు రూ.60,000, దేవనబోయిన రాజుకు రూ.19,500, ఆవుల రాజుకు రూ.12,000, కేతోజు భాస్కర్ కు రూ.15,500, కాట ఎల్లయ్యకు రూ.25,500, నడిగొట్టు బాలకిషన్ కు రూ.33,000 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## కేతకీలో జడ్జి పూజలు..



**ఝరాసంగం, అక్టోబర్ 10(జనంసాక్షి):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయంలో శనివారం శని అమావాస్యను పురస్కరించుకొని మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా కోర్టు జడ్జి ఓం శంకర్ పాటిల్ పార్వతీ సమేత సంగమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జికి ఆలయ ఈఓ శివారుద్రప్ప ప్రసాదాన్ని అందజేశారు.

## అదృశ్యమైన ఆటో డ్రైవర్..

- దిడిగి గ్రామ శివారులో కాలిపోయిన మృతదేహం!
- మన్నాపూర్‌కు చెందిన శ్రీనివాస్ మృతదేహంగా అనుమానం..
- కాలిపోయిన ఆటోతో కలకలం...



**మొగుడంపల్లి, అక్టోబర్ 10(జనంసాక్షి):** అదృశ్యమైన ఆటో డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నాపూర్ గ్రామానికి చెందిన మున్నూర్ శ్రీనివాస్ (49) ఈ నెల 7వ తేదీన అదృశ్యమయ్యారు. కిరాయికి ఆటో నడపడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో శనివారం దిడిగి గ్రామ శివారులో కాలిపోయిన ఆటోతో పాటు ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహం అదృశ్యమైన ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌దేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు విచారణ చేపడితేనే మృతుడి గుర్తింపు, మృతికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## రాయికోడు మున్మాదేవి ఆలయంలో నేటి నుంచి నవరాత్రి మహోత్సవాలు

- 19న మహా అన్నదానం, అమ్మవారి ఊరేగింపు

**రాయికోడ్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** మండల కేంద్రం రాయికోడ్‌లో భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ శ్రీ మున్మాదేవి ఆలయంలో దేవీ నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు సకరామ్ జోషి, సందీప్ జోషి తెలిపారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

**వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం...**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 11న బాలా త్రిపురసుందరి, 12న రాజరాజేశ్వరి, 13న గాయత్రి, 14న అన్నపూర్ణ, 15న లలితాదేవి, 16న మహాలక్ష్మి, 17న సరస్వతి, 18న మహాంకాళి, 19న దుర్గాదేవి, 20న విజయదశమి సందర్భంగా మున్మాదేవి అలంకారాల్లో దర్శనమివ్వనున్నారు.





**ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భజన కీర్తనలు...**

ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమై, అమ్మవారికి అభిషేకం, అలంకరణ, నైవేద్యం సమర్పిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు మంగళహారతి, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు శ్రీచక్రాలకు కుంకుమార్చన, హారతి కార్యక్రమాలు జరుగుతాయి. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు వివిధ గ్రామాల కళాకారులచే భజన కీర్తనలు నిర్వహించనున్నారు.

**19న మహా అన్నదానం, ఊరేగింపు...**

ఈనెల 19న ఆలయంలో మహా అన్నప్రసాద వితరణతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరగనుంది. 20న విజయదశమి సందర్భంగా రాత్రి 10 గంటలకు మహాహారతి నిర్వహించి, అనంతరం వేదసూక్తాలతో అమ్మవారికి విశ్రాంతి కార్యక్రమం చేపడతారు. భక్తులు, ప్రజా ప్రతినిధులు, భజన కళాకారులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## ఘనంగా 49వ అమావాస్య అన్నదానం



**తూప్రాన్, అక్టోబర్ 10(జనంసాక్షి):** ప్రతి నెల అమావాస్య గత 49 నెలలుగా అమావాస్య అన్నదానం నిర్వహిస్తున్నామని ఐవి ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహులు గుప్తా తెలిపారు. గత 49 నెలలుగా ప్రతి అమావాస్య రోజున సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని అందుకు సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు అమావాస్య అన్నదానానికి ముందుకు వచ్చిన వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు గాలి కౌసల్య రాజేశం పేరున వారి కుమారుడు గాలి కవిత లక్ష్మణ్‌లు అమావాస్య అన్నదానం నిర్వహించాలని ఈ సందర్భంగా ఐవీఎఫ్ తరపున సన్మానం చేశారు. తూప్రాన్ పట్టణానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అన్నదానశీ స్వీకరించారు. కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కంటాల రాజేశ్వర్ గుప్తా పట్టణ అధ్యక్షులు ఉప్పల అశోక్ గుప్త వైశ్య సంఘం అధ్యక్షులు పల్లెర్ల బాలేష్, బుక్క అశోక్, బుక్క విజయ్, నాగరాజు గుప్తా ,వెంకటేశం, శ్రీనివాస్ ,తదితరులు పాల్గొన్నారు

## బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో నేటి నుంచి దేవీ నవరాత్రులు

**గుమ్మడిదల, అక్టోబర్ 10 (జనంసాక్షి):** వీరన్నగూడెం (బొంతపల్లి) గ్రామంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. బాలా త్రిపురసుందరి, గాయత్రి, అన్నపూర్ణ, కామేశ్వరి, లలితా త్రిపురసుందరి, సరస్వతి, మహాలక్ష్మి, రాజరాజేశ్వరి, భద్రకాళి, విజయదుర్గ అలంకారాల్లో దర్శనమివ్వనున్నారు. 20వ తేదీ సాయంత్రం విజయదశమి, శమీ పూజలు నిర్వహించనున్నారు.



భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## మండల కేంద్రంలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

**కోహెడ, అక్టోబర్ 10 (జనంసాక్షి):** మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో అలాగే కోహెడలోని కొత్త బస్టాండ్ ప్రాంతములో శనివారం ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహిళలు రంగు రంగుల పూలతో పేర్చిన బతుకమ్మ లను ఒక్క దగ్గర ఉంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సంబరంగా, ఉత్సాహంగా పాటలు పాడుతూ ఎంగిలి పూల బతుకమ్మ పండుగను నిర్వహించారు.



## వర్షం కోసం ఎదురుచూపులు.. నర్సరీల్లో అమ్మకాలు కరువు

- ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత.. కూరగాయల సాగుపై రైతుల వెనుకడుగు
- గుమ్మడిదలలో 10-15 కూరగాయల నర్సరీలు.. గత ఏడాదితో పోలిస్తే భారీగా తగ్గిన విక్రయాలు
- పెట్టుబడులు పెట్టి మొక్కలు సిద్ధం చేసినా కొనుగోలుదారుల కోసం ఎదురుచూపులు

**గుమ్మడిదల, అక్టోబర్ 10 (జనంసాక్షి):** ఒకవైపు వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు మరోవైపు రైతులు ఎప్పుడు వస్తారా అని నర్సరీల నిర్వాహకుల నిరీక్షణ. వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, నీటి కొరత తీవ్రం కావడంతో కూరగాయల సాగుపై రైతులు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో గుమ్మడిదల మండలంలో కూరగాయల నర్సరీల వ్యాపారం ఈ ఏడాది మందగించింది. మండల పరిధిలో సుమారు 10 నుంచి 15 వరకు కూరగాయల నర్సరీలు ఉన్నాయి.

**మొక్కలు సిద్ధం.. కొనేవారు కరువు**

రైతుల నుంచి డిమాండ్ ఉంటుందనే అంచనాతో నర్సరీ నిర్వాహకులు పెట్టుబడులు పెట్టి వేలాది మొక్కలను సిద్ధం చేశారు. కానీ వర్షాభావ పరిస్థితులు, నీటి సమస్య కారణంగా రైతులు మొక్కలు కొనుగోలు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నా అమ్మకాలు మాత్రం ఆశించిన స్థాయిలో జరగడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు.

**నీటి కొరతే ప్రధాన కారణం...**

కూరగాయల సాగుకు నీరు అత్యంత కీలకం. ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉండటంతో బోర్లు, ఇతర నీటి వనరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాగు ప్రారంభించిన తర్వాత నీరు అందకపోతే పెట్టుబడి నష్టపోతామనే భయంతో కొంతమంది రైతులు మొక్కలు కొనుగోలు చేయడాన్ని వాయిదా వేస్తున్నారని నర్సరీ నిర్వాహకులు తెలిపారు.



**గత ఏడాది డిమాండ్.. ఈ ఏడాది నిరాశ...**

గత ఏడాది ఇదే సమయంలో కూరగాయల మొక్కలకు మంచి డిమాండ్ ఉండేదని నర్సరీ యజమానులు గుర్తుచేస్తున్నారు. రైతులు పెద్ద సంఖ్యలో మొక్కలు కొనుగోలు చేసేవారని, ఈ ఏడాది మాత్రం అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయని అంటున్నారు. దీంతో నర్సరీల నిర్వహణ ఖర్చులు, మొక్కల సంరక్షణ ఖర్చులు పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

**సురేష్ ఆవేదన...**

శ్రీ హనుమాన్ వెజిటబుల్ నర్సరీ ఫామ్ యజమాని సురేష్ మాట్లాడుతూ, "ఈ ఏడాది కూరగాయల మొక్కల అమ్మకాలు గత ఏడాదితో పోలిస్తే చాలా తగ్గిపోయాయి. రైతులు మొక్కలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రధానంగా నీటి కొరత కారణంగానే రైతులు సాగుకు వెనుకడుగు వేస్తున్నారు. వర్షాలు సరిగా లేకపోవడంతో సాగు చేసిన పంటను కాపాడుకోవడం కష్టమవుతుందనే భయం రైతుల్లో ఉంది.

**వర్షాలపైనే ఆశలు...**

వర్షాలు కురిసి భూమిలో తేమ పెరిగి, నీటి లభ్యత మెరుగుపడితే రైతులు తిరిగి కూరగాయల సాగుపై దృష్టి సారించే అవకాశం ఉందని నర్సరీ నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అప్పటి వరకు నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలను సంరక్షించడం తమకు పెద్ద సవాలుగా మారిందని చెబుతున్నారు.

**రైతులు సాగు చేయాలి.. నర్సరీలు నిలదొక్కుకోవాలి..**

వర్షాలు సమృద్ధిగా కురిసి నీటి సమస్య తీరితేనే రైతులతో పాటు కూరగాయల నర్సరీల వ్యాపారానికి కూడా ఊపిరి వస్తుందని నర్సరీ నిర్వాహకులు అంటున్నారు.

## ఆత్మకూర్ మున్సిపల్ కార్మికులు TUCI నుంచి CITUలో చేరిక

**ఆత్మకూర్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో శనివారం 20 మంది మున్సిపల్ కార్మికులు TUCI నుంచి CITUలో చేరారు. సిఐటియు మాజీ జిల్లా నాయకులు జి.ఎస్. గోపి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.ఎన్. రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. రాజు సమక్షంలో వారు CITU కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మున్సిపల్ కార్మికుల పక్షాన సిఐటియు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని, దేశంలో, రాష్ట్రంలో కార్మికుల పక్షాన నిలబడి పోరాడే సంఘం CITU కాబట్టే తాము CITUలో చేరామని తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సీనియారిటీ ప్రకారం జూనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని, కార్మికులందరినీ పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, వారాంతపు సెలవులు, నెలకు రెండు సెలవులు ఇవ్వాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. CITUలో చేరిన కార్మికుల్లో మక్బుల్, ఇస్మాయిల్, శివన్న, సోహెబ్, అంజన్న, నవీన్, ఆశన్న, మస్తాన్, గోపాల్, గఫూర్, నరేందర్, రంజిత్ తదితరులు ఉన్నారు.



# కల్హేర్‌లో రైతుల కదం.. కాంగ్రెస్ సర్కారుకు బీఆర్ఎస్ సవాల్!

- రైతు సమస్యలపై రణభేరి.. కల్హేర్‌లో బీఆర్ఎస్ భారీ పాదయాత్ర
- గుంతల రోడ్లు.. అందని సాగునీరు.. కల్హేర్‌లో రైతుల ఆగ్రహం?
- ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి







**కల్హేర్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** మండలంలో రోడ్ల దుస్థితి, నల్లవాగు నీటి సరఫరా సమస్య, రైతులకు ఎదురవుతున్న విద్యుత్ ఇబ్బందులను నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీ పాదయాత్ర నిర్వహించారు. మాసాన్‌పల్లి ఎక్స్ రోడ్డు నుంచి కల్హేర్ మండల కేంద్రం వరకు సాగిన పాద యాత్ర అనంతరం ధర్నా చేపట్టి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ ఉపకేంద్రాన్ని ముట్టడించి, అధికారులతో మాట్లాడి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

**ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ..** కల్హేర్ మండల ఏర్పాటుతో పాటు అభివృద్ధికి తమ కుటుంబం విశేష కృషి చేసిందన్నారు. గతంలో తాము మంజూరు చేయించిన రోడ్ల పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను ప్రశ్నించారు. రోడ్లపై గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్హేర్ కాముని చెరువు వరకు నల్లవాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నామని, ప్రస్తుతం నీటి సరఫరా సక్రమంగా లేక రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులకు నీటిని అందించి పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా మండలంలో చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి పనులేమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

రోడ్లు, సాగునీరు, విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించే వరకు ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని భూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అక్రమ ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

- ఇసుక టిప్పర్ ట్రాక్టర్ పట్టివేత

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 10(జనంసాక్షి):** అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్, ట్రాక్ట ర్ ను పట్టుకున్నట్లు ఎస్సై శివానందం తెలి పారు. శుక్రవారం రాత్రి మదూర్, గవ్వల పల్లి చౌరస్తా వద్ద రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, మెదక్ రూరల్ మండలం శివాయిపల్లి గ్రామానికి చెందిన మెగావత్ రమేష్‌కు చెందిన ఇసుక టిప్పర్‌ను మరియు ట్రాక్టర్ను పోలీస్‌లు పట్టుకున్నారు. మెదక్ రూరల్ ప్రాంత శివారులోని శివాయ పల్లి గ్రామానికి చెందినదిగా గుర్తించి ఈ ఘటనపై ఎస్ఐ. శివానంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నవరాత్రుల ఉత్సవాలకు ముస్తాబైన మండపాలు



**వెల్దుర్తి, అక్టోబర్ 10 (జనంసాక్షి):** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు వెల్దుర్తి మండలం వివిధ రకాల ఆకృతులతో సర్వాంగ సుందరంగా మండపాలు ముస్తాబైనాయి నేటి నుండే శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. వెల్దుర్తి మండల వ్యాప్తంగా సుమారు 12 మండపాలు ముస్తాబైనట్లు అధికారులు తెలిపారు నేటి నుండి తొమ్మిది రోజుల వరకు నవదుర్గ రూపాలలో అమ్మవారిని భక్తులు కొలుచుకోవడం జరుగుతుందని కోరిన కోరికలు తీర్చే దుర్గమ్మ ను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ నవరాత్రి ఉత్సవాలలో కొలుచుకోవడం జరుగుతుందని వెల్దుర్తి వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు గిరీష్ శర్మ తెలిపారు వెల్దుర్తిలోని శ్రీ దుర్గా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో గత 22 సంవత్సరాల నుండి నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు శుక్రవారం రోజున నవదుర్గ హోమం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

## వికలాంగుడికి ఆర్థిక సహాయం...

- నిత్యావసర సరుకుల పంపిణీ
- సానిక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ శివ



**చిన్నశంకరంపేట,అక్టోబర్ 10(జనంసాక్షి):** సానిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో, హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ సహకారంతో మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన యేసయ్యకు ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు.కొన్ని సంవత్సరాల క్రితం విద్యుత్ షాక్‌కు గురై చేతులు, కాళ్లు కోల్పోయిన యేసయ్య జీవనోపాధి, రోజువారీ అవసరాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సహాయం కోసం సానిక్ష ఫౌండేషన్‌ను ఆశ్రయించగా, స్పందించిన ఫౌండేషన్ ఆయనకు రూ. 2,000 ఆర్థిక సహాయం అందించడంతో పాటు, హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ సహకారంతో బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. హైదరాబాద్ నుంచి విచ్చేసిన ఇక్షణ ఫౌండేషన్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సానిక్ష ఫౌండేషన్ అధ్యక్షులు శివ, ఫౌండేషన్ సభ్యులు సాయి పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు తమ వంతు సహాయం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులోనూ దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవసరమైన వారికి సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## బతుకమ్మ పాటలతో మార్మోగిన దొమడుగు

- ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మహిళల సందడి



**గుమ్మడిదల, అక్టోబర్ 10 (జనంసాక్షి):** గుమ్మడిదల మండలం దొమడుగు గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలతో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కౌన్సిలర్లు అభిషేట్టి రాజశేఖర్, మద్ది సోనీ శేఖర్ రెడ్డి, నర్సంపల్లి రాజి రెడ్డి, బి. వరలక్ష్మి కృష్ణ పాల్గొన్నారు.

## పెత్తర అమావాస్య.. తప్పిన పెను ప్రమాదం




**పాపన్నపేట, అక్టోబర్ 10 (జనంసాక్షి):** పెత్తర మహాలయ అమావాస్య రోజున పెను ప్రమాదం తప్పింది. పెద్దలకు మాంసాహార వంటకాలతో నైవేద్యం సమర్పించే ఆనవాయితీ ఉంది. ఈసందర్భంగా శనివారం పాపన్నపేటలో వేకువజామున ఓ చికెన్ దుకాణం నిర్వాహకుడు కోడిని శుభ్రంచేసి విక్రయిస్తుండగా గ్యాస్ లీకైంది. సిలిండర్ కు మంటలు అంటుకోవడంతో నీటితో తడిపిన తట్టులు,వస్త్రాలతో ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేక పోయింది. గ్యాస్ అయిపోయే వరకు మంటలు కొనసాగి చివరకు తగ్గింది.

## శ్రీ వీరభద్రేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు



**రాయికోడు,అక్టోబర్10, (జనంసాక్షి):** మండల కేంద్రమైన రాయికోడ్ లో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయానికి అమావాస్య సందర్భంగా శనివారం భక్తులు భారీగా పోటెత్తారు. తెలంగాణ రాష్ట్రం తో పాటు కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవాలయం వద్ద తమ తమ మొక్కులను చెల్లించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. తధానంతరం దేవాలయంలో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఇందూరి కృష్ణ, పలువురు అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు ఆదేశాలను అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం

- టీడబ్ల్యూ జేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్తు మహిపాల్ రెడ్డి



**సిద్ధిపేట బ్యూరో, అక్టోబర్ 10 (జనంసాక్షి):** హైకోర్టు ఆదేశాలను అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకునేందుకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిటిషన్ దాఖలు చేయనున్నట్లు టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్తు మహిపాల్ రెడ్డి శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జారీ చేసిన కీలక ఉత్తర్వుల గడువు ముగిసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను అమలు చేయకపోవడం పై పిటీషనర్ తీవ్ర ఆవేదన చెందుతూ, ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను, ఆదేశాలను నిర్ణీత కాలంలోగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానికి ఉంటుందన్నారు. ఒకవేళ ఆ నిబంధనలను పాటించకపోతే, దానిని న్యాయవ్యవస్థను ధిక్కరించినట్లు భావిస్తూ కోర్టు ధిక్కరణ చట్టం 1971 కింద తగిన చర్యల కోసం బాధితులు కోర్టును ఆశ్రయించవచ్చునని ఆయన తెలిపారు. రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో తమ టీడబ్ల్యూజేఎఫ్ సంఘానికి ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా కేసును విచారించిన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పడుతూ, టీడబ్ల్యూజేఎఫ్ కు అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)లలో ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆగస్టు 3 న హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను ఆరు వారాల్లో గా అమలు చేయాలని కూడా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల అమలు గడువు ముగిసినా ఆదేశాలను అమలు చేయకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో పిటీషనర్ మామిడి సోమయ్య తిరిగి హైకోర్టు ను ఆశ్రయించి రాష్ట్ర ప్రభుత్వం పై కోర్టు ధిక్కరణ కేసు వేయనున్నట్లు చెప్పారు.ఇటీవలి కాలంలో వివిధ ప్రభుత్వ విభాగాలు న్యాయస్థానాల ఆదేశాలను నిర్లక్ష్యం చేయడంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే, తమకు అనుకూలంగా వచ్చిన తీర్పుపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో, బాధ్యులైన ఉన్నతాధికారులపై కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేసేందుకు పిటిషనర్ మామిడి సోమయ్య తరఫు న్యాయవాదులు ముసాయిదా సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ఈ పిటిషన్ హైకోర్టులో దాఖలు కానున్నట్లు తెలిపారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసినందుకు గానూ సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల డీపీఆర్వోలను ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చనున్నారని తెలిపారు. ఈ ధిక్కరణ కేసు ద్వారానైనా ప్రభుత్వంలో కదలిక వచ్చి హైకోర్టు ఆర్డర్ అమలు అవుతుందా? లేక కంటెంప్ట్ ఆఫ్ కోర్టు యాక్ట్ ద్వారా జైలు పాలవుతారా?అనేది వేచి చూడాలి.

## ఆకునూరు గ్రామ కాంగ్రెస్ కమిటీ నియామకం



**చేర్యాల, అక్టోబర్ 10 (జనంసాక్షి):** జనగామ నియోజకవర్గ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు చేర్యాల మండల అధ్యక్షులు మంజ మల్లేశం ఆధ్వర్యంలో శనివారం ఆకునూరు గ్రామ కాంగ్రెస్ కమిటీని నియమించారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఆకుల రాజు వరుసగా రెండవసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆకుల రాజు మాట్లాడుతూ.. ఆకునూరు గ్రామ శాఖ అధ్యక్షులుగా పార్టీ నాకు మరోసారి అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉన్నా, బాధ్యతగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తా అని తెలిపారు. గ్రామ శాఖ కమిటీలో ఉపాధ్యక్షుడిగా పెద్ద ముత్తని పోశయ్య, యూత్ అధ్యక్షుడిగా ఉడుత బాలరాజు, యూత్ ఉపాధ్యక్షుడిగా పౌడాల శివకృష్ణలను నియమించారు. ఈ కార్యక్రమంలో మండల జనరల్ సెక్రటరీ కొలిపాక వెంకటయ్య, సెక్రటరీ సయ్యద్ అజారుద్దీన్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాణి విద్యాలయంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుక



**న్యాల్‌కల్, అక్టోబర్ 10(జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీగా నిలిచే బతుకమ్మ వేడుక సంబురాన్ని ఘనంగా జరుపుకున్నారు. శనివారం పెద్దల అమావాస్య, ఎంగిలి పూల బతుకమ్మ పర్వదినాలు కావడంతో.. న్యాల్‌కల్‌లోని శ్రీవాణి విద్యాలయంలో వేడుకను సంబరంగా జరుపుకున్నారు. పాఠశాల ఉపా ధ్యాయ సిబ్బంది, బాలికలు బతుకమ్మ ఆట, పాటలతో ఆడి పాడారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు అధిక సంఖ్యలో బాలికలు వేడుకలో పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం శివకుమార్, విద్యాలత, అరుణ జ్యోతి, సోనీ, అనిత, పూజిత, అపురూప, సుమలత, వెన్నెల, సౌజన్య, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అరెస్టును ఖండించిన సిపిఎం నాయకులు



**ఆత్మకూర్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ఢిల్లీ జంతర్ మంతర్ లో జరుగుతున్న యువత ఉద్యమానికి మద్దతుగా వెళ్లిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ అరెస్టును సిపిఎం నాయకులు తీవ్రంగా ఖండించారు, జిల్లా నాయకులు జీఎస్ గోపి, ఎస్ అజయ్, వెంకటేష్, ఎస్ రాజు, రాఘవేంద్ర, మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రాష్ట్ర కార్యదర్శిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు, ఎన్నికల కమిషన్ తీరుపై ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూడడం దుర్మార్గమని అన్నారు, ఎన్నికల కమిషన్ స్వతంత్రను కాపాడాలని ప్రధాన ఎన్నికల అధికారి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు, వెంటనే జాన్ వెస్లీని బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు,

# మొరం ట్రిప్పులు 65-70.. బిల్లు రూ.1.25 లక్షలు

- సర్పంచ్ పుట్లగళ్ల మోహన్, పంచాయతీ సెక్రెటరీ కొమ్ముక్కై...
- సర్పంచ్, కార్యదర్శి తీరుపై ఉప సర్పంచ్ బాంచ వీరేశం ఫైర్.. సమగ్ర విచారణకు డిమాండ్



**కొల్చారం, అక్టోబర్ 10 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామపంచాయతీలో నిధుల వినియోగంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో పైతర స్వామి ఇంటి నుంచి హైస్కూల్ వరకు మొరం పోసిన పనికి సంబంధించి కేవలం 65 నుంచి 70 ట్రిప్పుల మొరం మాత్రమే వినియోగించారని, అయితే ఈ పనికి రూ. 1,25,454 డ్రా చేసినట్లు ఉపసర్పంచ్ బాంచె వీరేశం ఆరోపించారు. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ బాంచె వీరేశం మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్ పుట్లగళ్ల మోహన్, పంచాయతీ కార్యదర్శి పరస్పరం కుమ్మక్కై గ్రామపంచాయతీ నిధులను ఇష్టానుసారంగా డ్రా చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో చేపట్టే పనులు, నిధుల ఖర్చు వివరాలను తనకు, వార్డు సభ్యులకు తెలియజేయడం లేదని విమర్శించారు. ప్రజాప్రతినిధులమైన తమను సంప్రదించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**గ్రామంలో ఏ పని చేయాలన్నా ఆ నాయకుడే చెప్పాలా?**

గ్రామంలో ఏ పని చేపట్టాలన్నా ఒక నాయకుడి సూచనలకే ప్రాధాన్యం ఇస్తూ, ఎన్నికైన ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి పనులు చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. పైతర స్వామి ఇంటి నుంచి హైస్కూల్ వరకు మొరం పోసిన పనికి కూడా ఆ నాయకుడే యంత్రాలు సర్పంచ్ వాడుతున్నారు. ఆ నాయకుడు చెప్పినంత బిల్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసం..మొరం పోసిన పనికి డ్రా చేసిన మొత్తానికి పొంతన లేద ని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామసభలో ఈ విషయంపై పంచా యతీ కార్యదర్శిని నిలదీయగా, సరైన సమాధానం ఇవ్వలేకపోయారని ఉపసర్పంచ్ పేర్కొన్నారు. పంచాయతీ నిధుల వినియోగంపై ఉన్నతా ధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, పనుల కొలతలు, బిల్లులు, ఖర్చుల వివరాలను పరిశీలించాలని కోరారు. నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఉపసర్పంచ్ బాంచె వీరేశం డిమాండ్ చేశారు.

## పోలీసుల విజయాల వెనుక కుటుంబ సభ్యుల త్యాగాలు విలువైనవి

- ఆత్మీయ సమ్మేళనంలో కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 10(జనంసాక్షి):** పోలీసుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు ఎంతో విలువైనవి జిల్లా కలెక్టర్ ప్రియాంక,ఎస్పి డాక్టర్ వినీత్ అన్నారు.జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీసుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాక హాజరయ్యారు. ఎస్పీ డాక్టర్ వినీత్ దంపతులు, కుటుంబ సభ్యులు, జిల్లా పోలీసు అధికారులు, సిబంది కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఆటలు, దాండియా, బతుకమ్మ, పాటలు, నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల ను నిర్వహించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...** పోలీసులు రాత్రనక, పగలనక, పండు గలతో సంబంధం లేకుండా 24 గంటలూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచే స్తారని కొనియాడారు. జిల్లాలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వహించిన జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్‌తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందిం చారు. పోలీసుల విధి నిర్వహణ వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగా లు,సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్ మాట్లాడుతూ గత ఏడాది కాలంగా జిల్లా పోలీ స్ శాఖలో కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతా ధికారుల వరకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేశారని తెలిపారు.పోలీసుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు, సహకారం ఎంతో విలు వైనవని పేర్కొన్నారు.ఇలాంటి ఆత్మీయ సమ్మేళ నాలు పోలీసు కుటుంబాల మధ్య సాన్నిహిత్యాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు.

పోలీసులు విధుల్లో నిరంతరం నిమగ్నమై ఉండటం వల్ల వారి కుటుంబ సభ్యులు ఎన్నో సందర్భాల్లో తమ వ్యక్తిగత ఆనందాలను, అవసరాలను పక్కనపెట్టి సహక రిస్తారని ఎస్పీ తెలిపారు. పోలీసుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగాలు, సహ నం, ప్రోత్సాహం ఎంతో విలువైనవని అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యుల సహకారంతోనే మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలందించగలుగుతున్నామని పేర్కొన్నారు. విధి నిర్వహణలో చూపుతున్న అంకితభావాన్ని కొనసాగిస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు మహేష్, లింగయ్య,సి ఐ లు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

- పూల పండుగతో పల్లెల్లో వెల్లివిరిసిన తెలంగాణ సంస్కృతి
- మహిళల ఆటపాటలతో మార్మోగిన గ్రామాలు

**నంగునూరు, అక్టోబర్ 10 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలు నంగునూరు మండలవ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల సంబరాలకు నాంది పలుకుతూ తొలి రోజైన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సందడి చేశారు. నంగునూరు, సిద్దన్నపేట, గట్ల మల్యాల, మగ్దుంపూర్, పాలమాకుల, రాజగోపాలపేట, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, ముండ్రాయి, నర్మెట్ట, రాంపూర్, బద్దిపడగ, దర్గపల్లి, అక్కెనపల్లి, ఖాత, గణపురం, కొండంరాజుపల్లి, సంతోష నగర్, సీతారాంపల్లి, జేపీ తాండ, నాగరాజుపల్లి, రామచంద్రాపురం, అంక్షాపూర్, ఖానాపూర్, వెంకటాపూర్, మైసంపల్లి, అప్పలాయచెరువు తదితర గ్రామాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి.

**పూల సౌందర్యంతో ఆకట్టుకున్న బతుకమ్మలు...**

తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర సీజనల్ పూలతో పేర్చిన



బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మలను అలంకరించి, వాటి చుట్టూ వలయాకారంలో తిరుగుతూ జానపద గీతాలు ఆలపించారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

**మహిళల ఐక్యతకు ప్రతీక...**

బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబ అనుబంధాలకు, సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుంది. కులమతాలకు అతీతంగా మహిళలందరూ ఒకచోట చేరి వేడుకల్లో పాల్గొనడం ద్వారా పరస్పర స్నేహభావం, ఆత్మీయత పెంపొందుతున్నాయి. పెద్దలు పాడే సంప్రదాయ పాటలను యువతరం ఆలకిస్తూ తెలంగాణ సంస్కృతి, చరిత్ర, జీవన విలువలను తెలుసుకుంటోంది.



**ప్రకృతిని ఆరాధించే పండుగ...**

సహజంగా లభించే పూలతో బతుకమ్మలను పేర్చి పూజించడం ప్రకృతిపై తెలంగాణ ప్రజలకున్న ప్రేమకు నిదర్శనం. పూలు, చెట్లు, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని ఈ పండుగ చాటిచెబుతుంది. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు కొనసాగనున్నాయి. చివరి రోజైన సద్దుల బతుకమ్మ వేడుకలకు గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. మొత్తంగా నంగునూరు మండల గ్రామాల్లో రంగురంగుల బతుకమ్మలు, మహిళల ఆటపాటలతో పల్లెలు పండుగ శోభను సంతరించుకున్నాయి. తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ప్రజల్లో ఆనందాన్ని నింపాయి.

# పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ గోపాలపేటలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## బతుకమ్మ పాటలతో మార్మోగిన పాఠశాల ప్రాంగణం.. సంప్రదాయాల పరిరక్షణలో విద్యార్థుల సందడి

**గోపాలపేట, అక్టోబర్ 10 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోపాలపేటలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి అత్యంత వైభవంగా నిర్వహించారు. పూల పండుగ ప్రత్యేకతను చాటుతూ పాఠశాల ప్రాంగణం బతుకమ్మ పాటలు, బొడ్డెమ్మల ఆటపాటలతో సందడిగా మారింది. విద్యార్థులు సంప్రదాయ ఉత్సాహంతో వేడుకల్లో పాల్గొని పండుగ శోభను మరింత పెంచారు.




పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, తెలంగాణ జానపద సంస్కృతిని ప్రతిబింబించే పాటలు ఆలపించారు. సంప్రదాయ ఆటపాటలతో ఉత్సాహంగా గడుపుతూ బతుకమ్మ సంబరాలను కన్నులపండువగా జరుపుకున్నారు. విద్యార్థులు బొడ్డెమ్మలతో సందడి చేస్తూ పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. పాఠశాల ప్రాంగణమంతా బతుకమ్మ పాటలతో మార్మోగింది.

ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులను ప్రోత్సహిస్తూ బతుకమ్మ పాటలు పాడి, సంప్రదాయ ఆటపాటల్లో భాగస్వాములయ్యారు. పుస్తకాలకే పరిమితం కాకుండా తెలంగాణ సంస్కృతి, కళలు, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు పరిచయం చేసేలా వేడుకలను నిర్వహించారు. పండుగల ద్వారా ఐకమత్యం, సాంస్కృతిక విలువలు, పరస్పర గౌరవం పెంపొందుతాయని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

పాఠశాలల్లో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల అవగాహన పెరగడంతోపాటు కళాత్మక ప్రతిభకు ప్రోత్సాహం లభిస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భావితరాలకు పరిచయం చేయడంలో విద్యాసంస్థల పాత్ర ఎంతో కీలకమని ఈ వేడుకలు మరోసారి చాటిచెప్పాయి.

ఈ కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటమ్మ, పాఠశాల ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయులు జి. సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

# మెదక్ జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు

- కేసీఆర్ కృషిని గుర్తుచేస్తూ బీఆర్ఎస్ కాగడాల ర్యాలీ

మెదక్ బ్యూరో, అక్టోబర్ 10 (జనం సాక్షి): మెదక్ ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్షను మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సాకారం చేశారని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో కాగడాల ర్యాలీ నిర్వహించారు. క్రిస్టల్ గార్డెన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ డిపో వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మెదక్ జిల్లా కేంద్రంగా ప్రకటించినప్పటికీ ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు సంగారెడ్డిలో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తుచేశారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో పరిపాలన ప్రజలకు చేరువైందని, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం సహా పలు ప్రభుత్వ సంస్థలు స్థానికంగా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మెడికల్ కళాశాల, మాతా శిశు సంరక్షణ కేంద్రం, ఘనపూర్ ప్రాజెక్టు మరమ్మతుల ద్వారా ప్రాంత అభివృద్ధికి కేసీఆర్ కృషి చేశారని పేర్కొన్నారు. మెదక్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జిల్లా ఏర్పాటు కావడం తన రాజకీయ జీవితంలో మరపురాని ఘట్టమని అన్నారు.

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో 33 జిల్లాలు, గ్రామపంచాయతీల ఏర్పాటు ద్వారా పరిపాలనలో మార్పులు తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని



పేర్కొన్నారు. మెదక్‌లో మెడికల్, నర్సింగ్ కళాశాలలు, రైలు సదుపాయం అందుబాటులోకి రావడం అభివృద్ధిలో కీలకమని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా అభివృద్ధి వెనుకబడిందని వారు విమర్శించారు. వరద బాధితులకు ప్రకటించిన ఆర్థిక సాయం అందించలేదని, సింగూరు ప్రాజెక్టు నీటి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ నాయకత్వం అవసరమని అభిప్రాయపడ్డారు.

కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొట్టకూటి కోసం వెళితే ప్రాణాలు గాల్లో కలిశాయి

- కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం...
- ఇందువాసి గ్రామ కూలీ దుర్మరణం!

**గట్టు, అక్టోబర్ 10(జనంసాక్షి):** బతుకుదెరువు కోసం పొరుగు రాష్ట్రానికి వెళ్లిన కూలీల జీవి తాల్లో రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపిం ది. గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన 35 మంది దళితులు పత్తి తీసే పనుల కోసం కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరికి వలస వెళ్లారు. అక్కడ తాత్కాలిక నివాసా లు ఏర్పాటు చేసుకుని, ప్రతిరోజూ ట్రాక్టర్ ద్వారా పత్తి చేలల్లో పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం కూలీలంతా ట్రాక్టర్‌పై భారత్ మాల రోడ్డు గుండా పనులకు వెళ్తుండగా, రోడ్డు పనుల కోసం మట్టిని తరలిస్తున్న ఒక టిప్పర్ వేగంగా వచ్చి వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఏసేపు అనే కూలీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, నాగన్న అనే కూలీ పరిస్థితి అత్యంత విషమంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. క్షతగాత్రులను వెంటనే రాయచూరు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి-ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**

ప్రమాద వార్త తెలిసిన వెంటనే గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పందించారు. రాయచూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందే లా చూడాలని సూచించారు. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలతో



మాట్లాడి బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం-తెలంగాణ షిప్స్ అండ్ గోట్స్ కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత**

యాదగిరి రోడ్డు ప్రమాద బాధితులకు తాము అండగా ఉంటామని తెలంగాణ షిప్స్ అండ్ గోట్స్ కార్పొరేషన్ ఛైర్పర్సన్ సరిత భరోసా ఇచ్చారు. ఇందువాసి గ్రామ బాధితులతో ఆమె ఫోన్లో మాట్లాడి ప్రమాద వివరాలను, వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని, వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

## దుర్గామాత దేవి మండపాలు సిద్ధం



**వెల్దండ, అక్టోబర్ 10 (జనంసాక్షి):** వెల్దండ మండల కేంద్రంతో పాటు కోట్ర కుప్పగండ్ల చెర్కూర్ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. విజయదశమి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు కమిటీ నిర్వాహకులు తెలిపారు దుర్గా మాత ఉత్సవాలకు వెల్దండ మండల కేంద్రంలోని దుర్గామాత ఉత్సవాల కమిటీ అంగరంగ వైభవంగా నిర్వాహకులు మండపాలు ముస్తాబు చేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా కమిటీ సభ్యులు సంపం గి అనిల్, గంగపురం శేఖర్, వెంకటేష్, యాదగిరి, నరేష్, హరీష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో బాలుడికి తీవ్ర గాయాలు



**గండీడ్, అక్టోబర్ 10(జనంసాక్షి):** గండీడ్ మండలంలోని వెన్నచెడ్ గ్రామానికి చెందిన, కావలి వెంకటయ్య కుమారుడు శ్రీశైలం, ఇంటిపై ఎక్కి ఆడుకుంటున్న సమయంలో, ప్రమాదవశత్తు విద్యుత్ షాక్‌కు గురై చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంటిపై ఉన్న కరెంటు వైర్ల తగలడంతో పలు మార్లు చెప్పిన స్పందించలేదని బాలుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు,ఇట్టి విషయాన్ని గమనించి అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని. సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య అన్నారు. అదేవిధంగా ఆస్పత్రికి వెళ్లి బాలుడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి విద్యుత్ సిబ్బందికి కాల్ చేసి సమస్య పరిష్కరించాలని కోరారు.

### వరిగుంతం పంచాయతీ

## నిధుల వినియోగంపై వివాదం!

- 65-70 ట్రిప్పుల మొరానికే రూ.1.25 లక్షలకు పైగా డ్రా చేశారని ఆరోపణ
- సర్పంచ్, కార్యదర్శి కుమ్మక్కయ్యారని కాంగ్రెస్ నాయకుల విమర్శలు
- సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




**కొల్చారం, అక్టోబర్ 10 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామపంచాయతీలో నిధుల వినియోగం పై వివాదం చెలరేగింది. గ్రామంలో చేపట్టిన మొరం పనులకు సంబంధించి ఖర్చుల వివరాలపై మాజీ ఉపసర్పంచ్ జంగారి విజయ్ గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు ముత్యం గారి గోవర్ధన్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జోగిపేట విటల్ గౌడ్, మాజీ ఎంపీటీసీ తుడుము రామకృష్ణ అనుమానాలు వ్యక్తం చేశారు. సర్పంచ్ పుట్లగళ్ల మోహన్, పంచాయతీ కార్యదర్శి కుమ్మక్కై పంచాయతీ నిధులను ఇష్టానుసారంగా డ్రా చేస్తున్నారని వారు ఆరోపించారు.

**65-70 ట్రిప్పుల మొరానికే రూ.1,25,454 డ్రా?**

వారి వివరాల ప్రకారం.. గ్రామంలోని పైతర స్వామి ఇంటి నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు మొరం పోసే పనుల్లో కేవలం 65 నుంచి 70 ట్రిప్పుల మొరం మాత్రమే వినియోగించారని తెలిపారు. అయితే, ఈ పనులకు సంబంధించి రూ. 1,25,454 డ్రా చేసినట్లు ఆరోపించారు. వాస్తవంగా జరిగిన పనులకు, ఖర్చులుగా చూపిన నిధులకు మధ్య వ్యత్యాసం ఉందనే అనుమానాలను వారు వ్యక్తం చేశారు. పనుల వివరాలు, బిల్లులు, నిధుల వినియోగంపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

గ్రామసభలో ప్రశ్నించినా సమాధానం లేదని ఆరోపణ

గ్రామసభలో పంచాయతీ నిధుల ఖర్చులపై ప్రశ్నించినప్పటికీ సంబంధిత కార్యదర్శి నుంచి సంతృప్తికరమైన సమాధానం రాలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

ఉన్నతాధికారులు స్పందించాలి

పంచాయతీ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు కోరారు. నిధుల దుర్వినియోగం జరిగినట్లు విచారణలో తేలితే సంబంధిత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.

## విద్యుత్ వైర్లరాపిడితో మంటలు..

• కాలి బూడిద అయిన మొక్కజొన్న పంట



**రాజాపూర్, అక్టోబర్ 10(జనంసాక్షి):** సింగమ్మ గూడ గ్రామపంచాయతీ లో బిల్లు నాయక్ మొక్కజొన్న పంట పోలాల్లోనుండి విద్యుత్ వైర్లు ట్రాన్స్ ఫార్మర్ కు వెళ్ళే విద్యుత్ స్తంభాల మధ్యన రాపిడి జరిగి మంటలు చెలరేగి దాదాపు రెండు ఎకరాల మొక్కజొన్న పంట కాలి బూడిద అయింది అని రైతు బిల్లు నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా నే హెచ్చరించిన విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఈ నష్టం వాటిల్లింది అని రైతు తెలిపారు.

## ఎల్లుపేట్‌లో దారుణం..

• తల్లిని హతమార్చిన కుమారుడు



**టేక్మాల్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** ఎల్లుపేట్ గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తల్లి సాయమ్మ (40)పై డీజిల్ పోసి నిప్పంటించి నట్లు సమాచారం. ఈ ఘటనలో తీవ్రంగా కాలిన గాయాల పాలైన సాయమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి నిందితుడు దుర్గేష్ (18) అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

## కళ్యాణం మండపానికి
## గేట్ కోసం లక్ష రూపాయలు విరాళం



**మల్దకల్, అక్టోబర్ 10(జనంసాక్షి):** మల్దకల్ మండలంలోని సద్దలోనిపల్లి గ్రామంలో శనివారం స్వయంభు కృష్ణస్వామిని చింతలకుంటకు చెందిన జనార్దన్ దంపతులు దర్శించుకున్నారు.
ఆలయం వద్ద ఉన్న కళ్యాణ మండపానికి అవసరమైన గేటు కోసం లక్షా పది వేలు రూపాయలు విరాళంగా అందజేశారు.ఈ విరాళాన్ని గుడి పూజారికి అందజేశారు. దేవాలయం పూజారి దంపతులకు శేష శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, పూజారి పాండు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## మాట నిలబెట్టుకొని
## రూ.10 వేల విరాళం అందజేత



**కృష్ణ, అక్టోబర్ 10(జనంసాక్షి):** మండలంలోని ముడుమాల ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గడుగు వెంకటేష్ రూ.10 వేల విరాళం అందజేశారు. 2026 ఏప్రిల్ 23న పాఠశాలలో నిర్వహించిన విద్యా ప్రగతి వార్షిక కార్యక్రమంలో ప్రతి నెలా రూ.3 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి శనివారం విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దండు శేఖర్, ఉపాధ్యాయులు వెంకటేష్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం కీలకమని శేఖర్ పేర్కొన్నారు. గతంలో విరాళాలు ప్రకటించిన పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, సోఫీ పాల్గొన్నారు.

### ఓంకార్ కుటుంబానికి
## నిరంజన్ రెడ్డి పరామర్శ

• బుద్ధారంలో చంద్రమ్మ మృతికి సంతాపం



**గోపాలపేట, అక్టోబర్ 10 (జనంసాక్షి):** మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఓంకార్ తల్లి చంద్రమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శనివారం ఓంకార్ నివాసానికి వెళ్లి చంద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.
ఈ కార్యక్రమంలో రైతు సమితి అధ్యక్షుడు తిరుపతి యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ శేఖర్, సర్పంచ్ శేషిరెడ్డి, మతీన్, రాజేష్ గౌడ్, హర్యా నాయక్, బిళ్లకంటి రాజు, వెంకటయ్య, శివాజీ, శేఖర్ గౌడ్, అర్రు విష్ణు, పుల్యా, రాందాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## 12న జిల్లాలో డిజిపి పర్యటన

### అధికారులు రికార్డులతో సిద్ధంగా ఉండాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 10(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈ నెల 12న సోమవారం మహబూబ్నగర్, నారాయణపేట జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సర్కిల్ అధికారులు, డీఎస్పీలు, వివిధ విభాగాల అధికారులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం లో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశించారు. డీజీపీ పర్యటనను దృష్టిలో ఉంచుకొని పోలీస్ స్టేషన్లలో కేసుల వివరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలు,శాంతిభద్రతల పరిరక్షణ, రికార్డులు, రిజిస్టర్లను క్రమ బద్ధంగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల నియంత్రణ, మహిళలు, బాలల రక్షణ, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు చేపడుతున్న కార్యక్రమాల వివరాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, లింగయ్య,సిఐ లు శివ శంకర్, రామ్ లాల్, భగ వంత్ రెడ్డి, సైదులు, ఆర్ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పోలీసు శిక్షణ పరీక్షకు 1,485 మంది హాజరు

• ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల నుంచి విశేష స్పందన

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 10 (జనంసాక్షి):** ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అందించనున్న ఉచిత శిక్షణకు ఎంపిక చేసేందుకు నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,485 మంది అభ్యర్థులు హాజరయ్యారు.
జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షకు విశేష స్పందన లభించింది. సంగారెడ్డిలో 765 మంది, అందోల్‌లో 265 మంది, జహీరాబాద్‌లో 455 మంది పరీక్ష రాశారు.
ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా పుస్తకాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధ నతో పాటు పోలీసు ఉద్యోగాలకు అవసరమైన శారీరక శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. అర్హులైన యువత పోలీసు ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని



సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి, పట్టుదలతో సాధన చేసి పోలీసు ఉద్యోగాలు సాధించాలని ఎస్పీ సూచించారు.

## గద్వాల్ ఆర్టీసీ డిపో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**గద్వాల, అక్టోబర్ 10,(జనంసాక్షి):** గద్వాల ఆర్టీసీ డిపో ఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్ ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో డిపో అధ్యక్షుడిగా ఎన్నికైన గాల్ రెడ్డి, కార్యదర్శిగా ఎన్నికైన గిరిరాజ్ శనివారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు



ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి నూతన కార్యవర్గం నిరంతరం అందుబాటులో ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షుడు గడ్డం కృష్ణారెడ్డి ప్రత్యేకంగా పాల్గొన్నారు.

**వార్తకు అదనపు సమాచారం...**
యూనియన్ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ గద్వాల్ డిపోలో కార్మికులు శనివారం పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు.కార్మికుల హక్కుల రక్షణ కోసం, డిపో అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం ఐక్యంగా పనిచేస్తుందని నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఈ సందర్భంగా ప్రకటించారు.ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తామని వారు పేర్కొన్నారు.తమ గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్క ఆర్టీసీ కార్మికుడికి, మద్దతుగా నిలిచిన నాయకులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సైతం కార్మికులకు ప్రభుత్వం తరఫున ఎల్లప్పుడూ పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.

## కుట్రలు, ప్రలోభాలను అధిగమించి విజయం సాధించాం: వక్తలు

**వనపర్తి బ్యూరో అక్టోబర్10 (జనంసాక్షి):** అధికార పార్టీ అండతో విపక్ష కూటమి చేసిన కుట్రలు, ప్రలోభాలను అధిగమించి, కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) కూటమికి కార్మికులు విజయం అందించారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, ఎంప్లాయిస్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి బీకే విశ్వనాథ్, ఏఐటీయూసీ సీఆర్ గౌడ్, ఎంఎన్ రావు, ఉద్యోగులు నీలస్వామి, వీ.వీ. మూర్తి అన్నారు. రాష్ట్ర గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో శనివారం వనపర్తి ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు కార్మికుల హక్కులను సాధించే సత్తా ఈయూ కూటమికే ఉందని కార్మికులు విశ్వసించడం వల్లే ఈ విజయం సాధ్యమైందని వక్తలు పేర్కొన్నారు. గతంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పోరాటాలను గుర్తుంచుకుని కార్మికులు తమకు మద్దతుగా ఓట్లు వేశారని తెలిపారు. తమకు మద్దతుగా నిలిచిన కార్మికులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్మికులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ప్రభుత్వంతో పోరాడి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు హక్కులను సాధించేందుకు కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ



వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఆర్టీసీ ఈయూ కూటమి నాయకులు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగ ప్రముఖులు సూర్యనారాయణ, రవి, ఎంఎన్ రావు, సీఆర్ గౌడ్, నీలస్వామి, వీ.వీ. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



**మిడ్జిల్, అక్టోబర్ 10(జనంసాక్షి):** ఎన్నికల హామీలను నెరవేర్చి 17,200 మంది డీలర్ల కుటుంబాలను ఆదుకోవాలి. జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్నం సత్యనారాయణ గుప్తా. ఒక ప్రకటనలో తెలిపారు.
రాష్ట్రవ్యాప్తంగా గత 40 ఏళ్లుగా ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తూ ప్రజాసేవలో కీలక పాత్ర పోషిస్తున్న రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మహబూబ్‌నగర్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్నం సత్యనారాయణ గుప్తా కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి రాష్ట్రంలోని 17,200 మంది రేషన్ డీలర్లు, వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.
రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ఆయన పలు విజ్ఞప్తులు చేశారు.డీలర్ల ప్రధాన డిమాండ్లు ఇవే. ప్రతి రేషన్ డీలర్‌కు నెలకు రూ.5,000 గౌరవ వేతనం చెల్లించాలి. రేషన్ సరుకుల పంపిణీకి క్వింటాల్‌కు రూ.300 చొప్పున కమిషన్ ఇవ్వాలి.
సొంత ఇళ్లు లేని గ్రామీణ ప్రాంతాల రేషన్ డీలర్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి. అర్హులైన వృద్ధాప్య డీలర్లకు వృద్ధాప్య పింఛన్లు అందించాలి.
ప్రతి మండల కేంద్రంలో రేషన్ డీలర్ల సంఘం భవన నిర్మాణానికి 300 గజాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలి. డీలర్ మరణించినప్పుడు అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.20 వేల ఆర్థిక సహాయం అందించాలి.. డీలర్ మరణించిన సందర్భంలో కుటుంబానికి రూ.5 లక్షల వరకు బీమా పరిహారం అందించే పథకం అమలు చేయాలి. రేషన్ దుకాణాల నిర్వహణకు గది అద్దెను ప్రభుత్వం చెల్లించాలి.
ప్రతి డీలర్ కుటుంబానికి ఆరోగ్య బీమా లేదా హెల్త్ కార్డు సదుపాయం కల్పించాలి. ఆర్థికంగా వెనుకబడిన డీలర్ల కుటుంబాలకు ప్రత్యేక సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలవాలి.

**కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు...**

కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రేషన్ డీలర్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారని సత్యనారాయణ గుప్తా గుర్తుచేశారు. ప్రభుత్వాలు మారినా డీలర్ల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ఖర్చులు, తగిన ఆదాయం లేకపోవడం వల్ల అనేక మంది డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో రేషన్ డీలర్ల సంక్షేమానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17,200 మంది డీలర్ల కుటుంబాలకు భరోసా కల్పించాలని ఎన్నం సత్యనారాయణ గుప్తా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ప్రత్యేక పూజల్లో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాస్ దంపతులు



**బిజినేపల్లి, అక్టోబర్ 10 (జనంసాక్షి):** నంది వడ్డేమాన్ గ్రామంలోని శ్రీ శనేశ్వర స్వామి ఆలయంలో మహాలయ అమావాస్య సందర్భంగా ప్రత్యేక తిలతైల అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ బి. శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలతో పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్‌రావు, సర్పంచ్ సుగుణమ్మ, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా జిల్లా స్థాయి సైకిల్ పోటీలు



**మక్తల్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** మక్తల్‌లోని ఎల్లమ్మకుంట–కొత్త గార్లపల్లి రోడ్డులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ సైకిల్ పోటీలు నిర్వహించారు. 14, 17, 19 ఏళ్లలోపు బాలబాలికలకు 5 కిలోమీటర్ల రోడ్డు సైక్లింగ్ పోటీలు నిర్వహించగా, 126 మంది పాల్గొన్నారు. జిల్లా క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పోటీలను ప్రారంభించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల చివరి వారంలో సిద్దిపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# న్యాయం కోసం వస్తే చావును కోరిన అధికారి- గజ్వేల్ ఎమ్మార్వో నిర్వాకంపై నిరసనల జ్వాలలు

- **ఆవేదనతో ఉన్న రైతు నా పరిస్థితి చూసి నవ్వుతారా?**
- **ప్రశ్నించగా అవును.. నవ్వు వస్తది, బరాబర్ వస్తది**
- **అధికారి తీరుపై రైతు ప్రతినిధుల ఆగ్రహం**



**సిద్దిపేట బ్యూరో అక్టోబర్ 10 (జనంసాక్షి):** వ్యవసాయ భూమి సమస్యతో తీవ్ర మానసిక ఆందోళన చెందుతూ న్యాయం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఒక రైతు పట్ల సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మార్వో అత్యంత నిర్లక్ష్యంగా, అవహేళనగా వ్యవహరించడం కలకలం రేపుతోన్న వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ల్యాండ్ సమస్య పరిష్కారం కోసం అధికారిని ఆశ్రయించిన రైతుతో మాట్లాడే క్రమంలో ఎమ్మార్వో, **"నువ్వు ఇంకా పురుగుల మందు తాగలేదా.. బతికే ఉన్నావా?"** అంటూ దారుణమైన రీతిలో వ్యాఖ్యానించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆవేదనతో ఉన్న రైతు **"నా పరిస్థితి చూసి నవ్వుతారా?"** అని ప్రశ్నించగా, **"అవును.. నవ్వు వస్తది, బరాబర్ వస్తది"** అని బాధ్యతారాహిత్యంగా బదులిచ్చినట్లు తెలిసింది. సాగుభూమి సమస్యలతో సతమతమవుతున్న రైతులకు కొండంత అండగా నిలవాల్సిన బాధ్యతాయుతమైన అధికారి స్థానంలో ఉండి, ఇలాంటి నిర్దయగా మాట్లాడటం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోనే రైతుకు ఇలాంటి చేదు అనుభవం ఎదురుకావడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు, రైతు ప్రతినిధులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం చేయాల్సిన అధికారులే ప్రాణాలు తీసుకునేలా ప్రేరేపించేలా మాట్లాడటం శోచనీయమని పేర్కొన్నారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు



**బిజినేపల్లి, అక్టోబర్ 10 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ది మాస్టర్ మైండ్స్ ప్రైవేట్ పాఠశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా తయారు చేశారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతిపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి నుండి దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు... ముస్తాబైన ఆలయాలు, మంటపాలు



**నారాయణపేట అక్టోబర్10 (జనంసాక్షి):** దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా జిల్లాలోని దేవి ఆలయాలు, మంటపాలను ముస్తాబు చేశారు. మండలం, సింగారం గ్రామంలో శ్రీ గిరి పీఠంపైన కొలువైన భవానీ మాత ఆలయంలో ఆదివారం నుంచి శ్రీ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భవానీ మాత అమ్మవారు తొమ్మిది రోజుల పాటు బాలాత్రిపుర సుందరి దేవిగా, గాయత్రీ దేవిగా, అన్నపూర్ణాదేవిగా, శ్రీ మహాచండి దేవిగా, శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా, సరస్వతి దేవిగా, శ్రీ మహాలక్ష్మి దేవిగా, శ్రీ దుర్గాదేవిగా, శ్రీ మహిషాసుర మర్దినిగా, శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు వివిధ రూపాల్లో విశేషంగా భక్తులకు దర్శనమివ్వనున్నారని సమస్త భక్తాదులు అమ్మ సేవలో పాల్గొని తరించగలరని కోరారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష పూజలు, సామూహిక కుంకుమార్చన, ఒడి బియ్యం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. వీటితోపాటు జిల్లాలోని అయా గ్రామాల్లో దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంటపాలను ఏర్పాటు చేసి దుర్గామాత విగ్రహాలను ప్రతిష్టించనున్నారు.

# బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక




**ఊర్కొండ, అక్టోబర్ 8 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని శ్రీ వేంకట బాల్ రామయ్య ఐఐటీ, జేఈఈ, నీట్ అకాడమీలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అకాడమీ చైర్మన్ సామల తిరుపతయ్య బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి, అస్తిత్వానికి ప్రతీక అని అన్నారు. కరస్పాండెంట్ సామల బాలరాజు మాట్లాడుతూ బతుకమ్మ ప్రకృతి పండుగ అని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సంతోష్, శ్రీకాంత్, ప్రిన్సిపాల్ కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ రామ్ పెరుమాండ్ల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లలో అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు

- **మాల నిరుద్యోగులు, విద్యార్థుల హక్కుల కోసం ఐక్య పోరాటానికి పిలుపు**



**నారాయణఖేడ్, అక్టోబర్ 10 (జనంసాక్షి):** ఎస్సీ వర్గీకరణ అమలుతో మాలలకు ఉద్యోగ రిజర్వేషన్ల విషయంలో తీవ్ర నష్టం జరుగుతోందని మాల సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల పరిరక్షణ కోసం మాల నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.
నారాయణఖేడ్ పట్టణంలోని కార్తికేయ హోటల్‌లో శనివారం మాల మహానాడు జేఏసీ, మాల కోఆర్డినేషన్ ఫోరం ఆధ్వర్యంలో మాల నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శకుంతల మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాలలకు జరుగుతున్న నష్టాలను ప్రజలకు వివరించి, హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగాలని కోరారు.

**ప్రజాప్రతినిధులు స్పందించాలి...**

మాలల సమస్యలపై ప్రజాప్రతినిధులు స్పందించి, తమ వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విద్యార్థులు, నిరుద్యోగులు డిమాండ్ చేశారు. తమ సమస్యలపై స్పందించని ప్రజాప్రతినిధులను రానున్న ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో నిలదీస్తామని పేర్కొన్నారు.

**ప్రతి మండలంలో అవగాహన సమావేశాలు...**

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో త్వరలో సమావేశాలు నిర్వహించి ఎస్సీ వర్గీకరణపై అవగాహన కల్పించనున్నట్లు నాయకులు తెలిపారు. మాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు దేవరాజు, విశ్రాంత ప్రిన్సిపాల్ అనంతయ్య, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, నర్సింలు, దేవయ్య, కమలాపురం మారుతి, గైని సాయిలు, సంజయ్ కుమార్, నరసింహులు, విజయకుమార్, తిరుపతి, భీమ్‌సేన భాను, రాజు, లక్ష్మయ్య, మోహన్ రాజు, అనుముల తుకారం, జమ్మికుంట కళాబృందం సభ్యులు, పలువురు మాల సంఘాల నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

# ప్రకృతి ప్రతిబింబం బతుకమ్మ



## జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు

- తొమ్మిది రోజులు తీరొక్క పూలతో పూజలు
- గౌరమ్మను పూజిస్తే లక్ష్మీదేవిని పూజించినట్లే
- పూలతో అలంకారం..
- ఆరోగ్యం సద్దుల బతుకమ్మతో ఉత్సవాల ముగింపు

"ఇద్దరక్క చెల్లెల్లం ఉయ్యాల్లో..
ఒక్కూరికిచ్చిరి ఉయ్యాలో..
ఒక్కడే మాయన్న ఉయ్యాలో...
వచ్చన్న పోడాయె ఉయ్యాలో"
"ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ ఏమేమి
కాయప్పునే గౌరమ్మ తంగేడు పువ్వొప్పునే గౌరమ్మ
తంగేడు కాయప్పునే గౌరమ్మ"



*బతుకమ్మ తల్లికి మంత్రాలుండవు.. కలిసి పాడుకునే పాటే మంత్రం.. బతుకమ్మకు గుడులుండవు.. నలుగురు గుమిగూడిన చోటే గుడి నాలుగు చేతులు కలిస్తే కోలాటం.. జన జీవన సౌందర్యమే బతుకమ్మ.. కలిసి బతుకమనే సందేశాన్నిచ్చే సంస్కృతే బతుకమ్మ పండుగ.. బతుకే ఉత్సవమని బోధించే పండుగ ప్రపంచంలో ఇదొక్కటే కావచ్చు...*



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 10(జనం సాక్షి)

కష్టసుఖాలను కలగలిపిన అమ్మలక్కల బతుకు పాటలు, తంగేడు పువ్వు గొప్పతనాన్ని చందమామ ను గుర్తు చేస్తూ పాడుకునే మధురమైన పాటలతో రేపటి నుంచి పల్లె లోగిళ్లు మారుమ్రోగనున్నాయి. రంగురంగుల పూలు.. సన్నాయిని మించిన సప్పట్లు.. కోకిలను తలదన్నే కమ్మని రాగాలు.. చెమట చుక్కల నుంచి పుట్టిన పాటలు.. నెమలి నాట్యాలను మించే కోలాటాలు.. ఇలా తొమ్మిది రోజులు సంబరంగా సాగే పూల పండుగకు పల్లె, పట్టణం ముస్తాబయ్యాయి. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆడ బిడ్డలు అమ్మగారింటికి పోవడానికి పయనమయ్యారు. చిన్నా, పెద్దా సంచులు పట్టుకొని తీరొక్క పూల కోసం గ్రామాలలోని చెలకల తొవ్వబట్టారు.

**రోజుకో ఉత్సవాలు**

మహాలయ పక్ష అమావాస్య రోజున ప్రారంభమయ్యే ఈ పండుగ అష్టమి రోజున సుద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. అమావాస్య రోజున మట్టితో చేసిన బొడ్డెమ్మను సాగనంపి ఆ తెల్లవారు నుంచి ప్రతి రోజు సాయంత్ర రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక చోట పెట్టి ఆడపడుచు లంతా ఆటపాటలతో బతుకమ్మలను ఆరాధిస్తారు.

తొమ్మిది రోజులపాటు వేరు వేరు పేర్లతో అలం కరించే ఈ బతుకమ్మల్లో చివరిదే సద్దుల బతుకమ్మ. చివరి రోజు సంబారాన్నే సద్దుల బతుకమ్మ అంటారు. దసరాకు రెండు రోజుల ముందు ఈ పండుగ వస్తుంది. బతుకమ్మ పండుగకు 15 రోజులు ముందు వెనక తెలంగాణ ప్రాంతాల్లో అంతా సంతోషకర వాతా వరణమే కనిపిస్తుంది. ఇది వర్షాకాలం చివర, శీతా కాలం తొలిరోజుల్లో వస్తుంది కనుక వర్షాల వల్ల చెరు వులన్నీ నీటితో నిండి ఉంటాయి. రకరకాల పూలు పూస్తాయి. గునుగు, తంగేడి పూలు ప్రతి చోట కనిపి స్తాయి. బంతి, చేమంతి, నందివర్ధనం వంటివి ఇదే సమయంలో బాగా పూస్తాయి. సీతాఫలాలు నోరూరి స్తాయి. జొన్న పంట కోతకు సిద్ధంగా ఉంటుంది. వీటి నేపథ్యంలో బతుకమమ్మను తెలంగాణ ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని రంగురంగుల పూలతో కీర్తిస్తూ పండుగ జరుపుకుంటారు. ఆడపడుచులు అత్తవారి ఇంటి నుంచి పుట్టింటికి చేరుకుంటారు. ఈ వారం రోజుల్లో వీరు రోజు చిన్న బతుకమ్మలను తయారు చేసి సాయంత్రం వాటి చుట్టూ తిరుగుతూ ఆడి పాడుకొని వాటిని సమీప చెరువుల్లో నిమజ్జనం చేస్తారు.

**సత్తు పిండి వంటలు .......**

మొక్కజొన్నలు, వేరుసెనగ, పెసర విత్తనాల్లో వేటినైనా దోరగా వేయించి పిండి చేస్తారు. చక్కెర, బెల్లం, తగినంత నెయ్యి కలిపి సత్తుపిండిని తయారు చేస్తారు. చివరి రోజు సాయంత్రం ఆడపడుచులు అందరూ చక్కగా ముస్తాబై బతుకమ్మలను వాకిటిలో పెడతారు. చుట్టూ పక్కల ఉన్నవారు కూడా బతుక మ్మలను ఇదే విధంగా అమర్చి వాటి చుట్టూ వలయా కారంలో చేరుతారు. ఐక్యత, సోదరభావం, ప్రేమను రంగరిస్తూ మానవహారంగా ఏర్పడి పాటలు పాడు తారు. అనంతరం సత్తుపిండిని లేక వాటితో తయారు చేసిన తీపి రొట్టెలను పంచుకుంటారు.

**అలంకారం.. ఆరోగ్యం.........**



బతుకమ్మ కోసం వాడే పూలల్లో ఎన్నో ఔషదగుణాలుంటాయి. వీటి సువాసన, వాడకం వల్ల ఎన్నో రుగ్మతలు దూరం అవుతాయని వైద్యులు భావిస్తున్నారు. వీటి విలువ ప్రజలు తెలుసుకునేందుకు కూడా అప్పట్లో వీటి వాడకం జరిగిందే మోనని వారు భావిస్తున్నారు.

**తంగెడి పూలు**

ఎక్కడైనా లభించే ఈ పూలు పసుపు రంగులో ఇట్టే ఆకట్టుకుంటాయి. పీత పుష్పం అని కూడా అటారు. ఇవి గుత్తులుగా పూస్తాయి. నేల తంగేడు తదితర రకాలున్నా వీటన్నింటిలోనూ ఒకే రకమైన ఔషధ గుణా లుంటాయి. పైత్యానికి, కఫాన్ని తగ్గిస్తాయి. కళ్ల మంట, అతి వీరేచనాలు, చర్మ రుగ్మతల నివారణకు బాగా పనిచేస్తుంది.

**పోగడ పువ్వు**

వర్బెనానియా వంశానికి చెందిన ఈ పుష్పం శాస్త్రీయ నామం- క్లెరోడెండ్రం పనికు లాటం. దీన్నే బకుళా పుష్పం అంటారు. సువాసన వస్తుంది. పూర్వం బంగారు నగలతో పాటు దీనిని మహిళలు ఆభరణంగా వాడేవారు. నేత్ర రోగాలకు మంచి మందు కూడా. ఈ పూల రంగును చూడటంతో కళ్లకు ఒకరమైన శాంతి కూడా లభిస్తుంది.

**మందార పువ్వు**

దీని శాస్త్రీయ నామం హిబిస్కస్ రోజా సీనెన్సిస్. దీనిని హెర్బల్ టీ రూపంలో తీసుకుంటే కోలెస్ట్రాల్, మధుమేహం, మూత్రపిండ సమస్యలు, గొంతు వ్యాధి తగ్గుతుంది.

**గన్నేరు పువ్వు**

ఇది ప్రాణాంతక పుష్పం. దీని శాస్త్రీ యనామం నేరియం ఓలియండర్. దీన్ని అశ్వఘ్న అని కూడా పిలుస్తారు. గతంలో అశ్వాలను చంపడం కోసం ఈ పూలను వినియోగించే వారని ప్రతితీ, ఇది ఐదు రంగుల్లో పూస్తుంది. దీన్ని కేవలం అలంకారం, అందం కోసమే వాడుతారు.

**బంతి పూలు**

ఝుండూ పూలని కూడా పిలుస్తారు. ఇది బృంగరాజా వంశానికి చెందిన మొక్క దీని శాస్త్రీయ నామం కాలెండుల ఆఫిసినాలిస్. ఈ సీజన్లో బంతి పూలు విపరీతంగా పూస్తాయి. బంతిలో మహిళల రుతుక్రమ రుగ్మతలను తొలగించే గుణం ఉంటుంది. అలాగే కడపునొప్పి, క్లోమం, నట్టల నివారణకు ఈ మొక్క ఎంతో పనికి వస్తుంది. ఇవి ఎన్నో రంగుల్లో పూస్తాయి. ఏరంగైనా ఒకే ఔషద గుణాలుంటాయి.

**చామంతి పూలు**

ఆస్టెరాసియా వంశానికి చెందిన ఈ పుష్పం శాస్త్రీయ నామం క్రైసంథిమమ్. వీటిని తరుణి పుష్పం, షటపత్రం అని కూడా అంటారు. ఇది తల వెంట్రుకులు పెరగడానికి అందులో పేలు చనిపోవడానికి ఉపయోగపడ్తుంది.





